## తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

**మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్, జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో**

డోర్నకల్, ఫిబ్రవరి 21 : మున్సిపాలిటీలో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్, జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శుక్రవారం డోర్నకల్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఓహెచ్ఆర్ ట్యాంకును పరిశీలించి ఎంత సామర్థ్యం ఉంటుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపాలిటీ చెత్త డంపింగ్ చేసిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ అహ్మద్ పాల్గొన్నారు.

### రాత్రి వేళ లో ఇబ్బంది లేకుండా చూడాలి..

మహబూబాబాద్ రూరల్ : హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు రాత్రి వేళలో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాయ్స్ హాస్టల్‌ను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఇబ్బందులు కలుగొద్దు..

బయ్యారం : విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి ఏ ఇబ్బంది లేకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శుక్రవారం నామాలపాడు ఏకలవ్య పాఠశాలను తనిఖీ చేసి, రికార్డులు, కిచెన్ రూం, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ అశోక్ ఉన్నారు.

## ఎల్ ఆర్ఎస్ లబ్ధిదారులకు బంపర్ ఆఫర్..

**లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కీలక నిర్ణయం**

తొర్రూరు, ఫిబ్రవరి 21 : లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) అమలులో భాగంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. శుక్రవారం తొర్రూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, అంతేకాక, ఎల్ఆర్ఎస్ ఫీజులో 25% రాయితీ ఇవ్వడం ద్వారా లబ్ధిదారులకు ఊరటనిచ్చిందన్నారు. ఎల్ఆర్ఎస్ సంబంధిత ఫీజును సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేరుగా చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని మార్చి 31లోగా ఉపయోగించుకునే వారికి మాత్రమే రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. అనుమతి లేని లేఅవుట్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్‌పై గతంలో ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. దీంతో వాటిని కొనుగోలు చేసినవారు గత నాలుగేళ్లుగా రిజిస్ట్రేషన్ లేకుండా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారందరికీ ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తూ, ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసి విక్రయ దస్తావేజు కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఎం పార్టీ కార్యాలయంలో రెడ్ బుక్ డే

డోర్నకల్/చిన్నగూడూరు, ఫిబ్రవరి 21 : డోర్నకల్ సీపీఎం పార్టీ కార్యాలయం, చిన్నగూడూరు మండలంలోని గుండంరాజుపల్లిలో అంతర్జాతీయ రెడ్ బుక్ డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టి వెంకన్న, మండల నాయకులు దాసరి మల్లేశం మాట్లాడుతూ 1845వ సంవత్సరంలో కారల్ మార్క్స్ ప్రవేశపెట్టిన అంతర్జాతీయ రెడ్ బుక్ డే ప్రపంచ వ్యాప్తంగా నేటికి కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఉప్పెనపల్లి శ్రీనివాస్, బొబ్బ వెంకటరెడ్డి, శ్రీనివాస్, జేవీఆర్, సైదులు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గునిగంటి మోహన్, కందుకూరి సుధాకర్, నాయకులు వీరయ్య, లింగయ్య, వీరన్న, శంకర్, శ్రీనివాస్ ఉన్నారు.

## పంపుబావి తండాలో చోరీ

డోర్నకల్, ఫిబ్రవరి 21 : డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పంపు బావి తండాలో ఓ ఇంట్లో గురువారం రాత్రి దుండగులు చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పంపు బావి తండాకు చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి లకావత్ హరిరాం భార్యతో కలిసి తన కుమార్తె ఇంటికి వెళ్లాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి రూ.30,000 నగదు చోరీ చేశారు. ఘటన స్థలాన్ని ఎస్సై గడ్డం ఉమ పరిశీలించారు. క్లూం టీమ్ సభ్యులు ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## ఈతకు వెళ్లి చెరువులో ఒకరు గల్లంతు

తొర్రూరు, ఫిబ్రవరి 21 : చెరువులో ఈతకని వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని మాటేడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో బాతుక వెంకన్న(60)అనారోగ్యంతో మృతి చెందగా, శుక్రవారం దహన సంస్కారాలు పూర్తయ్యాయి. దహనసంస్కారాలకు హాజరైన అనంతరం చెరువులో స్నానం చేయడానికి వెళ్లిన దూదిమెట్ల ఐలయ్య (48) కొద్దిసేపటికీ తిరిగి రాకపోవడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. గల్లంతైన ఐలయ్య కోసం బంధువులు, గ్రామస్తులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. ఐలయ్యకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

I OOKANTI SAMBA REDDY (New Name) H.No. 1-120, Tirumalagiri (V), Regonda (M), Jayashankar Bhupalpally Dist. T.G., Have changed my name from OOKANTI SAMBAIAH to OOKANTI SAMBA REDDY S/o OOKANTI MUKUNDA REDDY.
NTW-000

**CHANGE OF NAME**

I, SAMPATH KUMAR (Old Name) H.NO.5-9-88 to 91, Lahari Legend Apartment, Kishanpura, Hanumakonda-Dist-500001, T.S. have changed my name from SAMPATH KUMAR to THALLA SAMPATH KUMAR(New Name) S/o. TALLA VARDARAJULU for all purposes.
NTW-5528

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**CHANGE OF NAME**

I, VARSHINI (Old Name) H.NO.5-9-88 to 91, Lahari Legend Apartment, Kishanpura, Hanumakonda Dist-506001, T.S have Changed my name from VARSHINI to THALLA VARSHINI DHANALAXMI (New Name) W/o. THALLA SAMPATH KUMAR for all purposes.
NTW-5528

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

- భోజనంలో మెనూ పాటించాలి
- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

ఇనుగుర్తి : వంటశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

ఇనుగుర్తి, ఫిబ్రవరి 21 : విద్యార్థులకు మెరుగైన విద్యనందించి వారి అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులం బాలికల పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అం దించాలని ఆదేశించారు. తరగతి గదులు, వంటశాల, పా ఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించి ప్రిన్సిపాల్ జయశ్రీకి పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాన్ని పరిశీలించిన ఆయన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రికార్డులను పరిశీలించి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### వంద శాతం ఫలితాలు సాధించాలి..

మహబూబాబాద్ రూరల్ : పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో వందశాతం ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యార్థుల పరీక్షల సంసిద్ధతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తీరుపై మండలాల ప్రత్యేక అధికారులు మూడు రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణం, నిత్యావసరాలు, నాణ్యతను పరీక్షించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు నూరుశాతం హాజరు అయ్యే విధంగా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహాల ప్రత్యేక అధికారులు, వార్డెన్లు పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్య అందించాలి

కేసముద్రం : విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మండలంలోని తిమ్మంపేట గ్రామంలోని కస్తూర్బాగాంధీబాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ దామోదర్ తదితరులు ఉన్నారు.

## బకాయిదారులకు సదవకాశం

**తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ లోకేష్**

కురవి, ఫిబ్రవరి 21 : తెలంగాణ గ్రామీణ బ్యాంకులో తీసుకున్న రుణాలు చెల్లించని బకాయిదారులకు సదవకాశం లభించినట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ లోకేష్ తెలిపారు. మండల కేంద్రంలోని బ్యాంకు లో శుక్రవారం ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31, 2024 వరకు రుణాలు చెల్లించకుండా ఉన్న మొండి బకాయిదారులకు వన్ టైం సెటిల్మెంట్ స్కీం ద్వారా రుణాన్ని తక్కువ మొత్తంలో పూర్తిగా క్లియర్ చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు 40శాతం నుంచి 75శాతం వరకు తగ్గింపు ఉంటుందని తెలిపారు. రూ.లక్ష రుణానికి రూ.40వేల నుంచిరూ.75 వేల వరకు తగ్గింపు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లోకేష్ కోరారు.

## బాలుర వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ

తొర్రూరు, ఫిబ్రవరి 21 : హాస్టళ్లలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. శుక్రవారం తొర్రూర్ పరిధిలోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం చర్లపాలెం హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ సూచించారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించి, డైనింగ్ హాల్ శుభ్రంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాక్ నిల్వలు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. మేనేజర్ కట్టస్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ పాల్గొన్నారు.

బాల్యతండాలో రాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్యానాయక్

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కురవి/మరిపెడ, ఫిబ్రవరి 21 : కురవి మండలం నేరడ శివారు బాల్యతండాకు చెందిన బాదావత్ రాములు, రాజోలు గ్రామానికి చెందిన డాక్టర్ సూరం చెన్నకృష్ణారెడ్డిలు ఇటీవల మృతిచెందగా డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబాలను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవి, చంద్రశేఖర్, ఈశ్వర్రీ కొండయ్య, వెంకట్, జలంధర్, శేఖర్, ధర్మనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు తోట లాలయ్య, తవ్వ వరలక్ష్మి, సత్యం పాల్గొన్నారు. అలాగే మరిపెడ మండలంలోని తానంచర్ల గ్రామానికి చెందిన ఈర్ల భిక్షం మృతి చెందగా రెడ్యానాయక్ అతడి భౌతికకాయంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవీందర్‌నాయక్, శ్వేతముఖేష్, దిగజర్ల శ్రీను పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పరామర్శ

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని రేగడి తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బానోత్ బాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ బాలు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాయిని రంజిత్‌కుమార్ లునావత్ అశోక్‌నాయక్, గుగులోత్ రామచంద్రునాయక్, నవీన్‌నాయక్, మంగీలాల్ పాల్గొన్నారు.

## యూరియా కోసం తప్పని తిప్పలు

యూరియా కోసం బారులు తీరిన రైతులు

దంతాలపలి, ఫిబ్రవరి 21 : రైతులకు యూరియా అందుబాటులో లేక ఇబ్బందులు తప్పడం లేదు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయానికి యూరియా బస్తాలతో లారీ రావడంతో యూరి యా కోసం రైతులు ఎగబడే పరిస్థితి వచ్చింది. గంటల తరబడి లైన్లో నిలబడితే కానీ బస్తా దొరికే పరిస్థితి లేకుండాపోయింది. కొందరు గంటల కొద్దీ నిలబడినా యూరియా దొరుకకపోవడంతో నిరాశతో వెనుతిరిగి వెళ్లారు.

## ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

కొత్తగూడ, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలో సేవాలాల్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ హాజరై పూజలు చేశారు. సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ నెహ్రూ, రూప్‌సింగ్, మల్లెల రణధీర్, డాక్టర్ రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

## మడిపల్లిలో గుప్తనిధుల కలకలం..

- పోలీసుల అదుపులో ఒకరు
- పరారీలో నలుగురు

తొర్రూరు ఫిబ్రవరి 21 : తొర్రూరు మండలంలోని మడిపల్లి గ్రామ శివారులో గుప్తనిధుల కోసం జరిగిన తవ్వకాలు కలకలం రేపాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి 12గంటల సమయంలో మడిపల్లి ఇటుక బట్టీల సమీపంలోని బావి ప్రాంతంలో ఐదుగురు వ్యక్తులు తవ్వకాలు ప్రారంభించారు. అటుగా పొలం వద్దకు బావి మోటర్ చూడడానికి వెళ్లిన ఓ వ్యక్తి ఈ ఘటనను గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని ఐదుగురిలో బ్రాహ్మణ కొత్తపల్లికి చెందిన జెల్ల వెంకన్నను పట్టుకున్నారు. మిగతా నలుగురిలో ఒకరు నెల్లికుదురు మండలం క్యాంపు తండాకు చెందిన సురేశ్‌గా గుర్తించారు. మిగతా ముగ్గురు అక్కడి నుంచి తప్పించుకున్నారు. దొరికిన జెల్ల వెంకన్నను గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. వెంకన్నపై కేసు నమోదు చేసి బైండోవర్ చేస్తున్నామని ఎస్సై ఉపేందర్ తెలిపారు. మిగతా నలుగురిని త్వరలో పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## గాయమైన వ్యక్తిపై అదే కేసు..గాయం కాని వ్యక్తిపై అదే కేసు?

- న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు
- సోషల్ మీడియాలో వైరల్

నర్సింహులపేట, ఫిబ్రవరి 21 : కక్షపూరితంగా చేసిన దాడి ఘటనలో గాయపడిన వ్యక్తిపైనే కేసు పెట్టడంతో తనకు న్యాయం చేయాలని బాధితుడు ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌కు ఫిర్యాదు చేశాడు. నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం స్టేజీ జీపీ శివారు హాజ్యతండాకు చెందిన బాధితుడు భూక్యారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల18న ఉదయం వరి పొలానికి మోటర్ పెట్టి తిరిగి ఇంటికి వస్తూ నర్సరీ వద్ద మోరీపై తమ తండాకు చెందిన నలుగురం కూర్చొని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ముచ్చటించుకుంటున్నట్ల తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతుబంధు వేయలేదని, తీన్మార్ మల్లన్న బీసీల గురించి మాట్లాడుతున్నాడని చర్చించుకుంటుండగా, భూక్యా వెంకన్న అనే వ్యక్తి మా కాంగ్రెస్ పార్టీ గురించి ఎందుకు మాట్లాడుతున్నావని అసభ్యజాలంతో తిడుతూ తన తలపై రాయితో కొట్టడంతో తీవ్రంగా గాయమై కింద పడిపోయినట్లు తెలిపాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని, చికిత్స నిమిత్తం తనను జిల్లా కేంద్రంలోని ఏరియా వైద్యశాలకు పంపినట్లు తెలిపాడు. అక్కడ తన తలకు 5 కుట్లు వేశారని చెప్పాడు. కాగా, తానే వెంకన్నను కొట్టినట్లు అధికార పార్టీ నాయకులు సూచనతో ఎలాంటి విచారణ చేయకుండానే పోలీసులు అక్రమంగా కేసు పెట్టినట్లు తెలిపాడు. తనపై కేసుపెట్టడం వెనుక స్థానిక ఎమ్మెల్యే హస్తం ఉందని, ఎస్సై కాంగ్రెస్ వాళ్ల కోసమే పని చేస్తున్నారని ఆరోపించాడు. ఈ విషయం గురువారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎస్సై సురేశ్‌ను వివరణ కోరగా.. ఇద్దరు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపాడు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వైద్యులు ఇచ్చిన నివేదిక ఆధారంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## మార్కెట్‌కు వరుస సెలవులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 : వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 26నుంచి మార్చి 2 వరకు వరుసగా ఐదు రోజులు సెలవులు ఇచ్చినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 26 న మహాశిరాత్రి, 27న జాగారం సందర్భంగా, 28న అమావాస్య, మార్చి 1న శనివారం వారాంతపు సెలవు, 2న ఆదివారం సెలవు సందర్భంగా రైతులు గమనించి మార్కెట్‌కు సరుకులు తీసుకు రావద్దన్నారు. మార్చి 3న మార్కెట్ యథావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయన్నారు.

### ఘనంగా మాతృభాషా దినోత్సవ వేడుకలు

డోర్నకల్/కురవి, ఫిబ్రవరి 21 : డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని రాజు తండా సెయింట్ పాల్స్ హై స్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సరిత మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మానిక, వసంత, సరిత, శ్రావణి, మాణి పాల్గొన్నారు. అలాగే కురవి మండలంలోని సూదనపల్లి యూపీఎస్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కార్యక్రమంలో హెచ్ఎం వెంకన్న, ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్‌కుమార్, ఎండీ అంజద్‌పాషా, సారంగం, బీ సరోజ, వీ శుభ, ఏ ప్రగతి, బాల రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'జీపీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలి'

నర్సింహులపేట, ఫిబ్రవరి 21 : మరుగుదొడ్ల బిల్లులు లబ్ధిదారుకు ఇవ్వకుండా కాజేసిన పంచాయతీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలని శుక్రవారం ఎంపీడీవో యాకయ్యకు గోల్ బొడ్కతండా గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు. తండాకు చెందిన 31మంది లబ్ధిదారులు ఈజీఎస్, ఎస్‌బీఎం పథకంలో మురుగు దొడ్లు నిర్మాణం చేసుకున్నప్పటికీ బిల్లులు చెక్కుల రూపంలో ఇవ్వకుండా ఇబ్బందుల కు గురి చేస్తున్నాడని ఆరోపించారు. 31మంది మరుగుదొడ్లకు సంబంధించి రూ.3,21020లు ఎస్‌బీఎం బ్యాంక్ ఖాతాలో డబ్బులు లబ్ధిదారులకు ఇవ్వకుండా కాజేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వెంకన్న, వాసు, గాంధీ తదితరులు ఉన్నారు.

## ఇసుక డంప్ సీజ్

డోర్నకల్, ఫిబ్రవరి 21 : డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని మైనార్టీ స్కూల్ వెనుక ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇసుక డంప్ ఏర్పాటు చేశారు. శుక్రవారం స్థానికుల సమాచారం మేరకు పోలీసు, రెవెన్యూ అధికారులు ఇసుక డంప్‌ను పరిశీలించి, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఇసుక డంప్‌ను సీజ్ చేశామని తహసీల్దార్ కృష్ణవేణి తెలిపారు. ఇసుక ఏడు ట్రాక్టర్లు కలిగి ఉంటుందని, దీని విలువ రూ.40వేలు ఉంటుందని తెలిపారు.

నర్సింహులపేట : నర్సింహాపురం బంజరలో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో ఎండిపోయిన వరిలో దిగాలుగా కూర్చున్న రైతు కట్ల అశోక్, వెంకన్న

# పట్టణంలో వరుస దొంగతనాలు

- హల్‌చల్ చేస్తున్న దొంగలు
- భయాందోళనలో ప్రజలు
- లోపించిన పెట్రోలింగ్ గస్తీ
- భద్రత కల్పించాలని ప్రజల వేడుకోలు

నెహ్రూ సెంటర్‌లో పగులగొట్టిన దుకాణ తలుపులను పరిశీలిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 : పట్టణంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. తలుపులను గడ్డపారతో పగులకొట్టి సొత్తును ఎత్తుకెళ్తున్నారు. గత ఐదు రోజుల నుంచి పట్టణంలోని పలు కాలనీల్లో జరుగుతున్న చోరీలతో ప్రజలు భయంతో జంకుతున్నారు. శివారు కాలనీ ప్రజలు బిక్కుబిక్కు మంటూ జీవిస్తున్నారు. దొంగల భయం తీవ్రంగా ఉండటంతో పట్టణ వాసులు ఆందోళనకు గురవుతున్నారు. టౌన్‌లో రాత్రి పూట పోలీస్ పెట్రోలింగ్ గస్తీ లేదని, దీంతో దొంగలు రెచ్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పట్టణంలో మూడు రోజులుగా వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 16న పట్టణంలోని సుందరయ్యనగర్‌కాలనీ అలపాటి శ్యామల దేవి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగుల కొట్టి రిజిస్ట్రేషన్ పత్రాలు, ఐదు తులాల బంగారం, రూ.50వేల నగదు అపహరించారు. ఈ నెల 17న హస్తినాపురం కాలనీలో ప్రతాపని రాజేశ్వర్‌రావు ఇంట్లో మధ్యాహ్నం పూటనే ఇంటికి ఉన్న తలుపులకు నిప్పు అంటించి ఇంట్లోకి వెళ్లటానికి ప్రయత్నం చేయగా స్థానికులు గమనించటంతో పారిపోయారు. ఈ నెల 18న సుందరానగర్‌లో నివాసం ఉండే మహబూబ్ అలీ ఇంట్లో దొంగలు పదిన్నర తులాల బంగారం, 30తులాల వెండి, రూ.90వేల నగదు అపహరించారు. ఈ నెల 19న లెనిన్‌నగర్ కాలనీలో మార్కయ్య ఇంట్లో తాళం పగులకొట్టి రూ.లక్షాయాభై వేల నగదు, తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు.

పట్టణంలోని నెహ్రూసెంటర్‌లో ఉన్న శ్రీసాయి బాలాజీ కిరాణం షాప్‌లో గురువారం గడ్డపారతో తలుపులు పగులకొట్టి దుండగులు లోపలికి వెళ్లారు. షాప్‌లో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హార్డ్ డిస్క్‌ను, రూ.60వేల విలువ చేసే డ్రైఫ్రూట్స్‌ను ఎత్తుకెళ్లారు. ఇలా వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే పోలీసులు కాలనీల్లో గస్తీని ముమ్మరం చేసి దొంగతనాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబవుతోంది. శుక్రవారం రాత్రి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

## బీరోనిమడవకు తీరిన నీటి కష్టం..

**'నమస్తే తెలంగాణ' కథనంతో చెక్‌వాల్వ్‌కు మరమ్మతులు**

బయ్యారం, ఫిబ్రవరి 21 : మూరుమూల బీరోనిమడవ గ్రామంలోని గిరిజన ప్రజలకు నీటి కష్టాలు తొలగిపోయాయి. భగీరథ నీటి చెక్‌వాల్వ్, పైపు లైన్లు విరిగిపోవటంతో పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు త